
చర్ల : తుపాను వల్ల నీట మునిగిన మిర్చితోట


చింతకాని : సీతంపేటలో నేలమట్టమైన పొలాన్ని చూపుతున్న రైతులు


అశ్వారావుపేట : నేలమట్టమైన కాకర పందిరి


చంద్రుగొండలో వరద కోతకు గురైన వరిపైరు


ముదిగొండ : వర్షానికి నేలకొరిగిన వరి


అశ్వారావుపేట రూరల్ :వేరుశనగ పంటలను చూపుతున్న లక్ష్మి


పాల్వంచ శ్రీనివాసకాలనీ వద్ద ముర్రేడువాగులో ప్రవహిస్తున్న వరద ఉధృతి

# ముంచెత్తిన వాన

- జిల్లాలో చేతికొచ్చిన వరి, పత్తి, మిర్చి పంటలు నీటిపాలు
- పనికి రాకుండా పోయిన పశువుల మేత
- అశ్వారావుపేటలో అత్యధికంగా 38 సెం.మీ. వర్షపాతం నమోదు
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్ ప్రియాంక ఆల
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు


ముర్రేడు వాగులో పొంగి ప్రవహిస్తున్న వర్షపు నీరు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : అల్పపీడన ద్రోణి జిల్లాను తాకడంతో బుధవారం రెండో రోజూ వర్షం ముంచెత్తింది. చేతికొచ్చిన వరి, పత్తి, మిర్చి పంటలను నీటిపాలు చేసింది. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిర్చి పంటలను తడిసి ముద్దయ్యాయి. మరోవైపు కోతకొచ్చిన వరి పంట నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నీటిపాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తుపాను తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను అప్రమత్తం చేశారు. రైతులు చేపట్టాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయాలని ఆదేశించడంతో వ్యవసాయాధికారులు గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలోని నంబర్ 08744-241950కు అత్యవసరమైతే కాల్ చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక అధికారులను అలర్ట్ చేశారు. కలెక్టర్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన విషయం విదితమే.

### రాత్రంతా వానే..

తుపాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. అత్యధికంగా అశ్వారావుపేటలో 380 మిల్లీమీటర్ల వర్షం కురవగా.. దమ్మపేట 260, ములకపల్లి 190 పాల్వంచ 250, టేకులపల్లి 120, అశ్వాపురం 190, చంద్రుగొండ 220, జూలూరుపాడు 190, కొత్తగూడెం 220 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా సగటున 11 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ముందే అప్రమత్తమైన రైతులు రాత్రికి రాత్రే ధాన్య, మిరి పంటపై టార్పాలిన్లు కప్పుకున్నారు. చాతకొండ, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలం అంజనాపురంలో పంట కల్లాల్లో వేసిన వరి కుప్పలు తడిసి ముద్దయ్యాయి. కొన్నిచోట్ల మిర్చి పంటలు నీట మునిగాయి. తీతకు వచ్చిన పత్తి సైతం మొక్కలపైనే తడిసిపోయింది.

### పొంగిన కిన్నెరసాని, ముర్రేడు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో జిల్లాలోని వాగులు, వంకలు, ప్రాజెక్టులు పొంగి ప్రవహించాయి. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి 8 వేల క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేశారు. కొత్తగూడెంలోని ముర్రేడు వాగు పొంగి ప్రవహిస్తోంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు చేరింది. సింగరేణి ఏరియా రుద్రంపూర్ ఓసీలోకి వర్షపు నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

### రెడ్ అలర్ట్ ప్రకటించిన కలెక్టర్

తుపాను తీవ్రతనుబట్టి కలెక్టర్ ప్రియాంక ఆల జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడంతోపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట పొలాల్లో పనులకు కూలీలను కూడా తీసుకెళ్లకూడదని సూచించారు. వర్షం తగ్గే వరకు ఇతర పనులకు బయటకు వెళ్లవద్దని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల వారు అవసరమైతే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. హాస్టల్ విద్యార్థులు వసతి గృహాల్లోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లొద్దని కలెక్టర్ సూచించారు.


కొత్తగూడెంలోని సినిమా థియేటర్‌లోకి చేరిన నీరు


ఖమ్మం రూరల్ : దెబ్బతిన్న పంటలను పరిశలిస్తున్న వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు


కిన్నెరసాని ఉధృతికి సోంపల్లి-బూర్గంపహాడ్ రహదారి మధ్యలో నీటమునిగిన వరి


చర్ల : నీట మునిగిన వడ్లు


కూసుమంచి : ధాన్యం తడవడంతో ఆరబెడుతున్న రైతులు

# ముసురుకుంది!

- చేతికొచ్చిన పంటలను ముంచిన 'మిగ్‌జాం'
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ వీపీ గౌతమ్
- నేలకొండపల్లిలో గోడ కూలి దంపతుల మరణం


అశ్వారావుపేట రూరల్ : వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీపీ,ఎంపీడీవో


చంద్రుగొండ మండలం తుంగారంలో నీట మునిగిన వరిపైరు చూపిస్తున్న రైతులు

ఖమ్మం, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మిగ్‌జాం తుపాన్ రెండు రోజులుగా ఉభయజిల్లాలను ముసురుకున్నది. చేతికొచ్చిన పంటలను ముంచెత్తింది. రైతులకు తీరని నష్టాన్ని మిగిలించింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం ఉదయం వరకు ఖమ్మం జిల్లాలోని 21 మండలాల పరిధిలో సగటున 6 సెం.మీకు పైగా వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సత్తుపల్లి మండలంలోని చెరువు బేతుపల్లి చెరువుతో పాటు కొన్ని చెరువులు అలుగు పోశాయి. అత్యధిక వర్షపాతం సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో నమోదైంది. పలు చోట్ల కల్లాల్లో ఉంచిన ధాన్యం తడిసి మద్దయింది. మరికొన్నిచోట్ల పత్తి, మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. వరి పనలు నేలకొరిగాయి. ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల్లో పంట నష్టం తీవ్రత ఎక్కువగా ఉంది. పంట దెబ్బతిన్న ప్రాంతాల్లో కలెక్టర్ వీపీ గౌతమ్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం.విజయనిర్మల పర్యటించారు. పంట నష్టంపై నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 82,000 ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. నేలకొండపల్లి మండలం చెరువు మాదారంలో గోడ కూలి దంపతులు నూకతోటి పుల్లారావు, లక్ష్మి మృతిచెందారు.

### జిల్లావ్యాప్తంగా వర్షపాతం వివరాలు ఇలా..

మంగళవారం తెల్లవారుజాము నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో సగటున 99.2 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సత్తుపల్లి మండలంలో 158.2 మి.మీ, వేంసూరులో 155.4 మి.మీ, ఎర్రుపాలెం 146.2 మి.మీ, మధిర 144.2 మి.మీ, ఏన్కూర్ 140 మి.మీ, కల్లూరు 136.2 మి.మీ, పెనుబల్లి 126.2 మి.మీ, బోనకల్ 128.6 మి.మీ, వైరా 115 మి.మీ, తల్లాడ 99 మి.మీ, కొణిజర్ల 90 మి.మీ, ఖమ్మం రూరల్ 71.8 మి.మీ, సింగరేణి 75.4 మి.మీ, కామేపల్లి 61.8 మి.మీ, రఘునాథపాలెం 63.2 మి.మీ, తిరుమలాయపాలెం 55.6 మి.మీ, కూసుమంచి 60.4 మి.మీ, ముదిగొండ 67.8 మి.మీ, చింతకాని 68.4 మి.మీ, ఖమ్మం అర్బన్ 77.8 మి.మీ, నేలకొండపల్లి మండలంలో 42.6 మి.మీ వర్షపాతం నమోదైంది. దాదాపుగా అన్ని మండలాల్లో 6 సెంటీమీటర్ల పైబడి వర్షపాతం నమోదు కావడం విశేషం.

### వర్ష బీభత్సంపై ఆరా..

మిగ్‌జాం తుపాన్ ప్రభావంపై మధిర, పాలేరు, ఖమ్మం ఎమ్మెల్యేలు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు స్వయంగా కాల్ చేసి వివరాలు తెలుసుకున్నారు. పంట నష్ట తీవ్రతను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్‌కు అవసరమైన ఆధునిక బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. యంత్రాంగం దెబ్బ పంటను పరిశీలించేలా ఆదేశాలివ్వాలన్నారు.


ఇల్లెందు రూరల్ : తడిసిన వరి పంట


అశ్వారావుపేట టౌన్ : నీటిలో కలెక్టర్‌ను కలిసేందుకు వస్తున్న గౌడబజార్ ముంపు వాసులు


పర్ణశాల : రెండు రోజులుగా కురిసిన వర్షానికి పర్ణశాలలో మునిగిన నారచీరెల ప్రాంతం


అశ్వారావుపేట రూరల్ : వినాయకపురంలో ప్రహరీ, పునాది దెబ్బతిన భవనం



అశ్వారావుపేట రూరల్ : వరదనీటిలో డాబా హోటల్


తుపాన్ కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న మధిర మున్నేరు వాగు


చుంచుపల్లి : రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ కరుణశ్రీ


పర్ణశాల : సున్నంబట్టి గ్రామం వద్ద రహదారిని పరిశీలిస్తున్న ఎంపీడీవో ముత్యాలరావు


సత్తుపల్లి రూరల్ : పెద్ద వంతెన వద్ద పొంగి పొర్లుతున్న తమ్మిలేరు


సత్తుపల్లి రూరల్ : అలుగుపారుతున్న బేతుపల్లి పెద్దచెరువు


సత్తుపల్లి రూరల్ : వరదనీటికి పొలాల్లో చేపలు పడుతున్న యువత


అశ్వారావుపేట టౌన్ : గౌడ బజార్‌లో నీటమునిగిన ఇల్లు